

# వి.ఐ.పి. దర్శనం

రావులపాటి సీతారాంరావు

**ప్రభుత్వంలో ఎ.సి.బి అనే శాఖ ఒకటి వుంటుంది. తెలుగులో 'అవినీతి నిరోధక శాఖ' అని అంటారు. చాలామందిని పోలీసు శాఖ లోంచి డిప్యుటేషన్ మీద పంపుతుంటారు. అలా నేను పని చేస్తున్న రోజుల్లో 'రవి' అని ఒక కానిస్టేబుల్ తిరుపతిలో ఎ.సి.బి లో ఉండేవాడు.**

**''తిరుపతిలో ఉద్యోగం అంటే రెల్వేస్టేషన్లో కాపురం పెట్టినట్లే సార్'' అని నాకు ఒకరోజు ఒక్క వాక్యంలో తిరుపతిలో ఉద్యోగస్తుల ఈతి బాధలను క్లుప్తీకరించాడు.**

రవితో నా సంబంధం కొద్దిరోజులయింతర్వాత ఉద్యోగ ధర్మాన్ని మించి స్నేహధర్మంగా మారింది. ఎ.సి.బిలో అతను చేసే పనల్లా హైద్రాబాదు నుంచి ఆ శాఖ తరపున వచ్చేవారికి సకల మర్యాదలతో తిరుమలలో దైవ దర్శనం చేయించే బృహత్కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగించటమే!

రవి పరిసరాలతో బాటు వ్యక్తులనూ వారి మనస్తత్వాలనూ పరిశీలించటం అలవాటు చేసుకున్న బహు నేర్పరి. పేరుకు కానిస్టేబుల్‌గా వున్నా అనుభవ గంధాన్ని మంచి సానమీద తీసి సమయానుకూలంగా మాటల్లో రంగరించే చమత్కారి.

నాకు, అతను వ్యక్తిగా బాగా దగ్గరకు వచ్చిన తీరు నేను ప్రస్తావించక తప్పదు.

హైద్రాబాద్ నుంచి ఆ శాఖకు సంబంధించిన పని మీద నేను ఒకసారి తిరుపతి వెళ్ళాను. నేను అంతకుముందే ఆ జిల్లాలో పనిచేయడం వల్ల దైవదర్శనానికి సంబంధించిన విషయాలను నా అంతట నేనే చక్కపెట్టుకుంటున్న తరుణంలో రవి హఠాత్తుగా వూడి పడ్డాడు.

'ఇట్లా అయితే కష్టం సార్!' అంటూ సంభాషణ నిష్ఠూరంగా మొదలు పెట్టాడు.

నాకు కోపం వచ్చింది. అతనికి నాకూ ఉద్యోగరీత్యా ఎన్నో అంతరాల తేడా! అలాంటిది నేనేదో పొరపాటు చేసినట్లుగా మాట్లాడుతున్న వాలకం చిరాకు తెప్పించటంతో 'ఏమిటి-నువ్వనేది? రవీ-మాట్లాడటం నేర్చుకో' అని గట్టిగానే దబాయించాను.

కొంచెం తగ్గి 'అది కాదు సార్! నాకు మట్లాడటం రాదు సార్! ఆ వేంకటేశ్వ్రరావు నేర్పలేదు సార్! నేను కొంచెం చెప్పేది వినండి సార్!' అన్నాడు.

'మధ్యలో ఆ వేంకటేశ్వ్రరావు ఎవడు?' అన్నాను. 'చెప్తా సార్! మీరు ఎ.సి.బిలో పెద్ద ఆఫీసర్! పని మీద ఇక్కడకు వచ్చారు. పని పూర్తయిం తర్వాత దర్శనానికి మీ అంతట మీరే ఏర్పాట్లు చేసుకున్నారు. మీకంటే పరిచయాలున్నవి కాబట్టి అన్ని సక్రమంగానే జరుగుతాయి. తతిమ్మావారి సంగతి ఏమిటి సార్?'

నాకు అర్థం కాలేదు. దైవదర్శనానికి నా అంతట నేను ఏర్పాట్లు చేసుకుంటే యితను ఎవరు అభ్యంతరం పెట్టటానికి? అదీగాక ఇతరుల కార్యక్రమాలతోటి నాకు ఏమిటీ సంబంధం?

'నువ్వు ఏం మాట్లాడుతున్నావో నాకు అర్థం కావడం లేదు అసలు ఏమిటీ సంగతి?' గట్టిగానే అడిగాను.

'ఏమీ లేదు సార్! తిరుపతిలో అన్నీ సక్రమంగా జరగాలంటే ఒక పద్ధతి ప్రకారం వెళ్ళాలి సార్! మీ పరిచయాలతో మీ అంతట మీరే దర్శనం చేసుకుంటే-పద్ధతులు నడవవు సార్! ఇక్కడ హైద్రాబాద్ నుంచి గానీ మరెక్కడ్నించి అయినా ఎ.సి.బీ తరపున ఎవరు వచ్చినా వారికి కాటేజీ యిప్పించటం దగ్గర్నుంచి -

దర్శనం అయిన తరువాత వీడ్కోలు ఇచ్చేంతవరకూ నేను చూసుకోవటం ఒక పద్ధతి సార్! దానికి బ్రేక్ పడితే ఎట్లా? టెంపుల్ అథారిటీస్ నన్ను చూసే ఓహోఎసీబి వచ్చింది దర్శనానికి అని అనుకుంటారు.

నేను లేకపోతే తీన్ తేరా-నౌ అఠారా! దేవుడి మాట ఒకటి వుంది గదా సార్! శంఖంలో పోస్తేనే తీర్థం కదా! అదీ సార్ సంగతి'- అని కాసేపు గాలి పీల్చుకొని నావైపు నిబ్బరంగా చూస్తూ 'వేంకటేశ్వ ర్రావు ఎవరిని అడిగారు కదా సార్!' అన్నాడు.

తమాయించుకుంటూ 'ఎవరు'? అని అడిగాను 'యింకెవరు ఆ స్వామే! కష్టాల్లో, సుఖాల్లో ఆయనే నా ఫ్రెండ్! మా వేంకటేశ్వరరావు లేనిది-ఆయన్ను రోజూ చూడనిది నాకు ఒక్క క్షణం గూడా గడవదు! ఏదో యిక్కడికి వచ్చేవారితో రోజూ ఆ స్వామిని చూసే కార్యక్రమం - చూపించే కార్యక్రమం పెట్టుకున్నాను. దాన్ని మీరెందుకు చెడగొడ్తారు సార్?' అటు తిరిగి ఆమాటలు అన్నాడు కానీ నాకు అర్థం అయింది - రవి ఏడుపును దిగమింగుతున్నాడని!

నేనేమీ మాట్లాడలేదు. రవి కాసేపటికి వెళ్ళిపోయింతరువాత నాదగ్గరకు వచ్చిన అధికారులు చెప్పారు. ప్రతి రోజూ రవి దర్శనాల పేరిట స్వామిని చూస్తాడని - స్వామి దర్శనం లేకపోతే అతనికి పిచ్చెక్కుతుందని!

రవి ఒక విధంగా పిచ్చివాడే! అప్పటినుంచీ కాని స్టేబుల్‌గా వున్న రవి మీద నాకు అభిమానం ఏర్పడింది. హైద్రాబాద్‌లో వున్నా-ఎవరిని దర్శనానికి పంపాలన్నా రవికే ఫోన్ చేసేవాడిని. చిత్రమేమిటంటే అతను ఒక్కడే! పెళ్ళి చేసుకోలేదు. కానీ ఇంట్లో ఫోన్ - అది స్వంత ఖర్చు మీద. సెల్ ఫోన్ గూడా మెయింటేన్ చేసేవాడు.

తిరుమల స్వామి దర్శనానికి ఎవరినైనా పంపిస్తున్నానంటే రవికి ఏనుగెక్కినంత సంబరం!

''సార్ మీరు పంపిన ఆ స్వాములోరు వచ్చారు సార్, పిల్లలూ, బంధువులతో, ఎటిసిలో ఒక కాటేజీ తీసాను సార్! ఆయన గారు స్వామిని చూడాలని ఒకటే ఉబలాట పడ్డాడు. అతి కష్టం మీద బ్రేక్ దర్శనం మన ఎ.సి.బి ఇన్‌ఫ్లుయన్స్ వాడి, ఏర్పాటు చేస్తే స్వామి సన్నిధిలోకి తీసుకొని పోయినంత సేపు బాగానే వున్నాడు సార్! మన సార్ దగ్గరకు పోగానే' 'సార్ ఎవరు'? అర్థం చేసుకోలేక అడిగాను!

'అదేసార్! మన వేంకటేశ్వరస్వామి... అక్కడికి పోగానే స్వామిని చూడకుండా, కళ్ళు గట్టిగా మూసుకొని, ఓ.. ఒకటే చెంపలు లప లపా వాయించుకున్నాడు సార్! నేనేమో కళ్ళు తెరిచి స్వామిని చూడవయ్యా, మహానుభావా అని ఎంతచెప్పినా వినకుండా కళ్ళు మూసుకొనే వున్నాడు సార్! నా శ్రమంతా వేస్టయి పోయింది సార్! అయినా నాకు అర్థం కాదు సార్! స్వామిని చూడటానికి అంత కష్టపడి ఇక్కడికి వస్తారు - దేవుడి ముందుకు రాగానే కళ్ళు మూసుకొని దండం పెట్టుకుంటారే గాని ఆ ప్రత్యక్ష దైవాన్ని ప్రత్యక్షంగా చూడరెందుకని సార్?' అనుభవాన్ని అమాయకత్వాన్ని మిళాయించి అడిగాడు.

అలాంటి ప్రశ్నలకు నేనేం జవాబు చెప్పగలను? అది నిజం గూడా! క్షణకాలం దర్శనం కోసం వెళ్ళిన ప్రతివాడు అక్కడికి వెళ్ళగానే కళ్ళుమూసుకోవటం నేనే చూసాను. అంతెందుకు నేను కూడా ఆ బాపతే! కళ్ళనిండా ఆ స్వామిని వుంచుకోవటం చాతగాక భక్తులు అలా చేస్తారా? ఏమో మరి! రవి మాత్రం రెప్పార్పకుండా స్వామినే చూసేవాడు. చూస్తూనే 'మా సార్ వచ్చాడు, హారతి కొంచెం ఎక్కువసేపు ఇవ్వాలి - స్వామి వంటి మీద చందనం మా సార్‌కు ఇవ్వండి' అంటూ అక్కడున్న అర్చక శ్రేష్ఠులకు గూడా ఆదేశాలిచ్చేవాడు. వాళ్ళు గూడా చిరునవ్వుతో అతను చెప్పినట్లే చేసేవారు! నాకు కొద్దిరోజుల వరకూ అసలు సంగతి అర్థం కాలేదు. ఒకసారి రవి చెప్తేనే నాకు తెలిసింది!

'సార్! నేను ఎక్కడ పుట్టానో, ఎట్లా పుట్టానో ఎప్పుడు పుట్టానో నాకు తెలియదు. నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ తెలిసిందల్లా వేంకటేశ్వరస్వామే! యిక్కడ పని చేసేవారూ, దేవాలయ సిబ్బందీ, అర్చకులే నాకు అన్నీ! అనాథగా పెరిగిన నేను దేవుడి ప్రాంగణం అంతా శుభ్రం చేసి బతికి బట్టకట్టాను. ఆ స్వామి ప్రసాదం ముప్పూటా తిని పొట్ట పోసుకు




న్నాను. తోచనప్పుడు స్వామి దర్శనం వీలుపడని సమయాల్లోనే ఇక్కడే వున్న బళ్ళో చదువుకున్నాను. అయ్యవార్లే నాకు చదువు చెప్పించారు. బట్టలు కుట్టించారు. టెంపుల్ లోకి ఎప్పుడు వెళ్ళినా అభ్యంతర పెట్టలేదు. నాదెప్పుడూ వి.ఐ.పి దర్శనమే సార్! నా చిన్నప్పటినుంచీ స్వామి నాకు ఫ్రెండ్ గదా! అందుకే నాకు అన్నీ ఫ్రీ! గుడి ముందే పోలీస్ స్టేషన్ వుండేది గదా! ఆ రోజుల్లో నేనంటే జాలి పడిన ఓ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.పి గారికి చెప్పి నన్ను రిక్రూట్ చేయించాడు. గుళ్ళో మనోడు ఒకడు వుంటాడు సార్ అని! లేకపోతే నా చదువుకు ఎవడిస్తాడు సార్ పోలీసు ఉద్యోగం? క్రమేపీ నేనిక్కడ వుండటానికి రూల్స్ అడ్డొచ్చాయి. అందుకే లోకల్ పోలీసులో కాకుండా కొన్నాళ్ళు సి.ఐ.డీ, మరికొన్నాళ్ళు విజిలెన్స్ సెల్స్, ఇప్పుడు ఎ.సి.బి. అవన్నీ లూప్‌లైన్లని అందరూ అంటారు సార్! దాని అర్థం నాకు తెలియదు కానీ, మాస్వామి దగ్గరకు మాత్రం నాది డైరెక్ట్ లైనే! అందుకే సార్, మనసార్లకు ఎంత పలుకుబడి వున్నా వాళ్లంతట వాళ్ళు చేసుకున్న దర్శనం నిజమైన దర్శనం కాదు సార్! నేను దగ్గరుండి చేయిస్తేనే నిజమైన దర్శనం! నేను చేయిస్తున్నపుడు స్వామిని చూడండి సార్! మొహం వెలిగి పోతూవుంటుంది!'


అతని మాటల వెనక భక్తి పారవశ్యం నాకు అర్థం అయింది. నేను ఎ.సి.బి.లో వున్నన్నాళ్ళు నా దర్శనాలు 'థ్రూ ప్రాపర్ చానెల్' లోనే! అంటే రవి ద్వారానే! ఆ తరువాత శాఖ మారింతరువాత గూడా తిరుపతి వెళ్ళినప్పుడల్లా కబురు చేసి, అతని సరదా కబుర్లు వినటం నాకు అలవాటయింది!

నేను ఎవరినయినా దర్శనానికి పంపినప్పుడు పనికాగానే ఠంచన్‌గా ఫోన్ చేసి చెప్పేవాడు !

'సార్! మన బాబాయి వచ్చాడు. బ్రహ్మాండంగా దర్శనం అయింది. అదేంటి సార్ మన బావగారు వచ్చాడు కానీ అంతా హర్రీ బర్రీ. తీరిగ్గా యీసారి రమ్మనండి సార్! అమ్మగారికీ నాన్నగారికి దగ్గరుండి అంతా నేనే చూసుకున్నాను సార్! మన పొలిటికల్ లీడర్ బావగారు, వద్దన్నా వంద రూపాయలు జేబులో కుక్కాడు సార్!' మాది ఎ.సి.బి. సార్ అన్నా వినిపించుకోలేదు! నేనేం చేయను సార్! అలా ఎప్పటి కప్పుడు ప్రత్యక్ష సమాచారమే!

ఆ మధ్య తిరుపతి వెళ్ళినప్పుడు తీరిక దొరకగానే రవిని పిలిపించుకున్నాను. 'ఏమిటి సంగతులు'? అని అడిగాను.'మొన్ననే మంచి ఇన్సిడెంట్ జరిగింది సార్' అని పడిపడి నవ్వసాగాడు. నాకు అర్థం కాలేదు. 'ఏమిటో వివరంగా చెప్పు' అని ఆసక్తిగా అడిగాను.

'ఏమీ లేదు సార్! హైద్రాబాద్ నుంచి మా జాయింట్ డైరక్టరో, ఎడిషనల్ డైరెక్టరో ఎవరో ఫోన్ చేసారు. నేనే ఫోన్ ఎత్తాను. నువ్వు ఎవరివి అని అడిగాడు. నేను రవిని అన్నాను. రవి అంటే... దర్శనాలు చేయించే రవిని అన్నాను. ఆయన కొత్త సార్. పద్ధతులు తెలియవు. 'మీ సార్‌ను పిలువు అని గద్దించాడు – నేను మా సార్‌ను పిలిచాను. మా సార్ టెలిఫోన్‌లో మట్లాడుతున్నంత సేపు- 'సార్ – మంచిది సార్! అన్నీ చూసుకుంటా సార్! నేనే దగ్గరుంటాను సార్! తమరు చెప్పాల్నా సార్!' ఇలా అన్నిటికీ వణుకుతూ ఫోన్లో జవాబు చెప్పింతర్వాత – ఫోన్ పెట్టేసి గాలి పీల్చుకున్నాడు. మా సార్ గూడా కొత్తగా వచ్చినాయనే! యిక్కడ సంగతీ, సందర్భమూ తెలియదు. కొంచెం భయం, భయంగా 'మన పెద్దసార్‌కు దగ్గరాయన ఎవరో ఎకిలేకర్ అట! వస్తున్నారు. ఎల్లుండి ప్రొద్దున్నా – ఏ రైలులో వస్తున్నదీ చెప్పాడు. ఫ్యామిలీతో వస్తున్నాడు. మంచి దర్శనం చేయించి పంపమన్నారు అన్నాడు. ఓస్ అంతేగదా నేను చూసుకుంటాను నాకు వదిలి పెట్టండి సార్ అన్నాను. ఆయన వినిపించుకోలేదు. కుదరదు రైల్వేస్టేషనుకు నేనే వచ్చి రిసీవ్ చేసుకుంటాను అన్నాడు. మేమేం చేస్తాం. ఎకిలేకర్ సార్ వచ్చే రోజున మా సిబ్బంది అంతా రైల్వేస్టేషన్‌కు ట్రయిన్ వచ్చే సమయానికి వెళ్ళాం. మాసార్ కొత్త గదా! ఎందుకయినా మంచిదని ఒక పూలదండతో సహా వచ్చాడు. ఫుల్ సూటు వేసుకున్నాడు. తిరుపతిలో ఎండా కాలం ఎవరికోసమో సూట్ ఎందుకన్నా వినలేదు. ట్రయిన్ కొంచెం లేటు అయింది. సూట్‌లో మాసార్ చెమటలు గక్కుతూ అతలాకుతలం అయ్యాడు. ట్రయిన్ రాబోయే ముందు మాకు ఎన్నో ఆదేశాలు యిచ్చాడు. వాళ్ళు దిగగానే ఎగబడొద్దని చెప్పాడు. ఆయన మొదట రిసీవ్ చేసుకొని పూలదండ వేసిం తరువాత ర్యాంకుల వారీగా మమ్మల్నిపరిచయం చేస్తానన్నాడు. ట్రయిన్ వచ్చింది. మాసార్ ఒకటే ఉరుకులు పరుగులు. ట్రయిన్ ఆగనీయండి సార్ అన్నా వినలేదు. ఆ ఎకిలేకర్ సార్‌ను మేము ఎవ్వరం చూడలేదు. ఆ ఇబ్బంది వున్నా ట్రయిన్ ఆగగానే మేము మొదట ఫస్ట్ ఎసీ చూసాం! లేరు! తర్వాత సెండ్ ఎసీ థర్డ్ ఏసీ ఎక్కడా ఎకిలేకర్ సార్ లేరు – ఫ్యామిలీ లేదు! పూలదండతో మాసార్ అటూ ఇటూ పూలన్నీ రాలిపోతున్నాయి. లాభం లేదనుకొని రైల్వే మైక్‌లో ఇంగ్లీషులో తెలుగులో ఎనౌన్సు చేయించాం. ప్రయాణీకులంతా వెళ్ళిపోతున్నారు. ప్లాట్ ఫాం ఖాళీ అవుతున్నది. అయినా ఎకిలేకర్ సార్ జాడలేదు! అప్పుడు నేనే చెప్పాను. హిందీ పేరులా వుంది. హిందీ భాషలో ఎనౌన్సు చేస్తే బాగుంటుందేమోనని! హిందీలో ప్రకటించిన కాసేపటికి తలకు పాగాలాంటిది చుట్టుకున్న ఒకాయన బెదురుతూ మా దగ్గరకు వచ్చాడు. ధోతి పైకి కట్టుకున్నాడు. తెల్ల మీసాలున్నాయి. భయం భయంగా మాసార్‌ను చూస్తూ 'హైద్రాబాద్ సార్ పంపారు. నేనే ఎకిలేకర్‌ని' అన్నాడు. మాసార్ ఆపాదమస్తకం అతడ్ని పరికించి చూసాడు. టై లూజ్ చేసి 'మీ ఫ్యామిలీ' అని అడిగాడు 'అగో మావాళ్ళు' అని దూరంగా నిల్చున్న వాళ్ళను చూపించాడు. మాసార్ నిగ్రహాన్ని కోల్పోయాడు 'ఏం చేస్తుంటావ్' కొంచెం కోపంగానే అడిగాడు. 'హైద్రాబాద్ లో నన్నుపంపిన సార్ బట్టలు యిస్త్రీ చేస్తుంటాను సార్' అన్నాడు. అంతే మాసార్ అక్కణ్ణే విసా విసా కోటూ టై తీసేసి అల్లంత దూరాన వున్న మరో కానిస్టేబుల్ వైపు విసిరేసి 'వాళ్ళను దర్శనం చేయించి పంపు' అని ఎకిలేకర్ ఫ్యామిలీ కోసం పెట్టిన కారులో వెళ్ళి పోయాడు. రైల్వేస్టేషన్లో మాస్టాఫంతా ముసిముసి నవ్వులతో పలాయనం చిత్తగించారు. నేను వాళ్ళను తీసుకెళ్ళి మంచిదర్శనం విఐపి బ్రేక్ దర్శనం చేయించాను. ఎకిలేకర్ తదేకంగా స్వామిని చూస్తూ తనివి తీరా ఎన్నో మొక్కులు మొక్కుకొని ఇంత చిల్లర హుండీలో భక్తి పారవశ్యంతో వేసాడు. ఆ కుటుంబం నన్ను మరో వెంకటేశ్వరస్వామిలా చూస్తుంటే వాళ్ళను రైలెక్కించాను. ఆ తర్వాత మాసార్ తో అన్నాను 'సార్-మన హైద్రాబాద్ సార్ మనల్ను స్టేషనుకు వెళ్ళి రిసీవ్ చేసుకోమని చెప్పలేదు గదా! పాపం వాళ్ళు దర్శనం కోసం తిరుపతికి బయలు దేరితే మనం ఇక్కడ వున్నామని కష్టం లేకుండా దర్శనం చేయించమన్నాడు. మనం హైద్రాబాద్ నుంచి వచ్చేది ఎవరో వి.ఐ.పి అనుకొని అలవాటు చొప్పున ఏర్పాట్లు చేసాం. అయినా తప్పేముంది సార్! స్వామికి ఎకిలేకర్‌కు వి.ఐ.పి దర్శనం చేయించాలనిపించింది. చేయించాడు. అంతే! ఎవరికి ఎంత ప్రాప్తమో, మనం ఏం చెప్పగలం 'మీకు తేడాలున్నాయి కానీ నాకు అందరు ఒక్కటే' అని స్వామి చెప్తాడు గానీ- మనకే ఆ ఆట అర్థంకాదు' అని ముగించాడు. రవి దర్శనాలు చేయించే వాడే కాదు-దార్శనికుడు కూడా అని ఆక్షణాన అన్పించింది!




★

రావులపాటి సీతారాంరావు
93913 48723